క్లుప్తంగా

ఉరుసు నిర్వహణకు సహకరించండి

రామాపురం : ఈనెల 13, 14, 15 తేదీలలో మండలంలోని నీలకంఠ్రావుపేట ఉరుసు మహోత్సవం జరుగుతుందని హిందూ ముస్లిం సోదరులు సోదరభావంతో మెలిగి ఉరుసు మహోత్సవాన్ని జరుపుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు, లక్కిరెడ్డిపల్లె సీఐ కొండారెడ్డి, ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డిలు పిలుపునిచ్చారు. మండలంలోని నీలకంఠ్రావుపేట దర్గా ప్రాంగణంలో సోమవారం హిందూ ముస్లిం సోదరులతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ ఉరుసు మహోత్సవంలో హిందువులు, ముస్లింలు మతసామరస్యంగా జరుపుకోవాలని, ఎవరైనా ప్రజలను రెచ్చగొట్టే విధంగా వ్యవహరించరాదని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలన్నారు. ఈ సమావేశానికి హిందూ ముస్లిం సోదరులు ఉరుసు నిర్వాహకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

గాలివీడు : మండల విద్యుత్ శాఖ ఏఈగా లక్ష్మయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు మునుపు విధులు నిర్వహించిన నరేంద్రారెడ్డి బదిలీపై వెళ్లిన తరువాత గాలివీడు మండల ఏఈ స్థానం ఖాళీగా ఉండటంతో రైతులు, వినియోగదారులు చాలా ఇబ్బందులు పడ్డారు. ఇలాంటి తరుణంలో నూతన ఏఈని నియమించడం పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

చిట్వేలి : ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని తద్వారా ఉన్నత పదవులతో భవిష్యత్తుకు బంగారుబాట వేసుకోవచ్చని విశ్రాంత ప్రిన్సిపల్ ఏలూరి ప్రభుదాస్ పేర్కొన్నారు. స్థానిక సమీకృత వసతి గృహం, కె.కందులవారిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు సోమవారం శాంతిసేవా సొసైటీ ఆధ్వర్యంలో ప్రభుదాస్ ఆర్థిక సహకారంతో ప్యాడ్, పెన్ను, పెన్సిల్, రబ్బరు వంటి పరీక్షల సామగ్రిని ఉచితంగా పంపిణీ చేశారు. అలాగే విద్యార్థులకు పరీక్షలకు సంబంధించిన సలహాలు, సూచనలు తెలియపరిచారు. కార్యక్రమంలో వార్డన్ కిరణ్ కుమార్, ప్రధానోపాధ్యాయుడు భాస్కర్, ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

వైభవంగా గ్రామోత్సవం

గాలివీడు : మండల కేంద్రంలోని స్థానిక బ్రాహ్మణ వీధిలో కొలువైవున్న శ్రీ వేంకటేశ్వర స్వామి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ట అనంతరం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణ, పూజలు జరిపారు. సాయంకాలం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై పెద్దూరు నుంచి బస్టాండ్, హైస్కూల్, గేటు నాలుగురోడ్ల కూడలి వరకు ఊరేగించారు.

నిరుద్యోగులకు ఉపయోగకరంగా డ్రైవింగ్ కోర్సు

రాజంపేట రూరల్ : ఆర్టీసీ సంస్థ అందించే డ్రైవింగ్ కోర్సు నిరుద్యోగులకు ఎంతో ఉపయోగకరంగా మారిందని ఎంవీఐ బీ.వినోద్‌కుమార్ అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోలో డ్రైవింగ్ కోర్సు పూర్తి చేసుకున్న 17వ బ్యాచ్ డ్రైవర్లకు అభినందన సభను సోమవారం డిపో మేనేజర్ జి.రమణయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంవీఐ వినోద్‌కుమార్ డిపో మేనేజర్ రమణయ్యతో కలిసి శిక్షణ పూర్తి చేసుకున్న డ్రైవర్లకు సర్టిఫికెట్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి నుంచి 18వ బ్యాచ్‌కు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలియజేశారు. సమావేశంలో డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్‌లు బాషా, మత్తయిలు పాల్గొన్నారు.

సావిత్రిబాయి సేవలు చిరస్మరణీయం

పుల్లంపేట : మండల పరిధిలోని కొత్తపేట జెడ్పీ హెచ్ఎస్‌లో సోమవారం సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున మాట్లాడుతూ ఆధునిక భారతదేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా, సంఘ సంస్కర్తగా సావిత్రిబాయి పూలే సమాజానికి సేవలు అందించారని, ఆమె సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది రాజయ్య, సుకన్య, వెంకటరత్నం, ఇంద్రావతి, ప్రసాద్ రెడ్డి, కిషోర్, వెంకటరామిరెడ్డి, చంద్రశేఖర్, పిడి బాల శేఖర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లేఔట్లపై చర్యలు తీసుకోండి

గాలివీడు : మండలంలో అక్రమంగా వేస్తున్న అక్రమ లేఔట్లపై చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి యర్ర నాగభాస్కర్ రెడ్డి, మండల అధ్యక్షుడు గొట్లమిట్ట శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ భాగ్యలతను కలసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నెంబర్ 928, 1483 బుట్టిగారిపల్లె సమీపంలో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎలాంటి అనుమతులు లేకుండా వ్యవసాయ భూములను ప్లాట్లుగా మలచి ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ లక్షల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. అంతేగాక ఆ భూములకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూములను కలుపుకుని అక్రమ వెంచర్లు వేస్తున్నారని తెలిపారు. తక్షణమే విచారణ జరిపి ప్లాట్ల విక్రయం నిలిపివేసి, అక్రమ లేఔట్లు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అక్రమణలో ఉన్న ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నీటి ఇక్కట్లు ఇంతింత కాదయా!

మార్చి ఆరంభంలోనే మొదలైన కష్టాలు
- తాగునీటి కోసం వ్యవసాయ బోర్లను ఆశ్రయిస్తున్న ప్రజలు
- రాయచోటి నియోజకవర్గంలో సమస్య అధికం
- పనులు మానుకొని నీటిని తెచ్చుకుంటున్న వైనం
- ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్న అధికారులు



నందలూరు: తాగునీటి కోసం నారాయణరాజుపేటకు వెళ్తున్న మహిళలు



రాయచోటి: సరఫరా చేసేందుకు నీటిని పట్టుకుంటున్న ట్యాంకర్లు



లక్కిరెడ్డిపల్లె: జి.వడ్డెపల్లెలో నిరుపయోగంగా ఉన్న తాగునీటి బోరు

రాయచోటి : మార్చి ఆరంభంలోనే భానుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. భానుడి వేడిమి భూగర్భ జలాలు సైతం అడుగంటుతున్న పరిస్థితులు నెలకొంటున్నాయి. దీంతో గ్రామాల్లో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బోరు బావి నుంచి నీరు అందకపోవడంతో రెండు, మూడు కిలోమీటర్ల మేర నడిచి ఆయా గ్రామాల్లోని చేన్లు, తోటలలో ఉన్న బోర్ల వద్ద నీటిని పట్టుకుని తమ ఇంటి అవసరాలను తీర్చుకుంటున్నారు. రోజుకు ఒక మనిషి సగటున 55 లీటర్ల నీటిని వినియోగిస్తుండగా, నలుగురు ఉన్న కుటుంబంలో పెద్దలు తమ పనులు మానుకొని నీటి తెచ్చుకోవడానికి వెళుతుండటంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాయచోటి నియోజకవర్గంలో నీటి సమస్య అధికంగా ఉంది. నియోజకవర్గం పరిధిలో ఆరు మండలాల్లో లక్కిరెడ్డిపల్లె, రామాపురం, సంబేపల్లె, చిన్నమండెం మండలాల్లోని గ్రామాల్లో నీటి కోసం ప్రజలు అవస్థలు పడుతున్నారు. తాలూకాలో మొత్తం 118 గ్రామాలు ఉండగా 35 గ్రామాల్లో ప్రజలు నీటి తిప్పలు పడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో 21 గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తెలిపారు. అలానే 58 గ్రామాల్లో బోర్లు వేసేందుకు చర్యలు తీసుకోగా 39 చోట్ల నీరు పడగా.. 19 చోట్ల నీరు పడలేదని అధికారులు పేర్కొన్నారు. వేసవి ఆరంభంలోనే పరిస్థితి ఇలా ఉంటే రాబోయే రెండు, మూడు నెలలు తాము తాగునీటికి ఇక్కట్లు పడాల్సిందేనన్న ఆవేదనను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

తిప్పలు తప్పించండి.. మహా ప్రభో

నందలూరు : మండలంలోని పాటూరు పంచాయతీ వెంకటాద్రి పురం ఎస్టీ కాలనీ ఏర్పడి సుమారు అరవై సంవత్సరాలు పైగా అయ్యింది. ఇప్పటికీ మంచినీరు లేక అక్కడి ప్రజలు పడుతున్న బాధలు వర్ణనాతీతం. గ్రామంలో దాదాపు 50 కుటుంబాలకు చెందిన 250 మంది జీవిస్తున్నారు. కూలి పనులకు వెళ్తేనే వారి జీవనాలు గడుస్తాయి. కొంతమంది జీవాలను మేపుకొని వారి కుటుంబాలను పోషించుకుంటున్నారు. గ్రామం ఏర్పడి ఇన్ని సంవత్సరాలైనా అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు గానీ వారికి తాగునీరు ఇచ్చిన పాపానపోలేదు. దాదాపు కేవలం రెండు కిలోమీటర్ల దూరంలో బహుదా నది ఉంది. మండలంలోని అన్ని పంచాయతీలలో చెయ్యేరు నుంచి ప్రజలకు తాగునీరు అందిస్తున్నారు. ఈ గ్రామంలో మాత్రం రెండు బోర్లు ఏర్పాటు చేసి నీరు అందజేస్తున్నారు. ఆ బోరు నుంచి వచ్చే ఉప్పునీటిలో చిలుము. సుద్ద వస్తోందని ఆ నీరు తాగలేకున్నామని అక్కడి ప్రజలు వాపోతున్నారు. బోరు నుంచి వచ్చే నీటితో బోకులు కూడా పాడైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఎన్నికల ముందు నాయకులు వస్తున్నారని, హామీలు ఇస్తున్నారని మా బాధను తీర్చేవారు ఎవరూ లేరని విలపిస్తున్నారు. గత పంచాయతీ ఎన్నికల ముందు సర్పంచ్‌గా పోటీ చేసిన నాయకులు తాము గెలిస్తే చెయ్యేరు నుంచి తాగునీటి పైపు లైను వేయించి నీటిట్యాంకు కట్టిస్తామని హామీ ఇచ్చారని, కానీ హామీని నెరవేర్చలేదని మండిపడుతున్నారు. నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీలోని దాదాపు ఒక కిలోమీటర్ పరిధిలోని నారాయణరాజుపేటకు వెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్నామని తెలియజేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తమ బాధను అర్థం చేసుకొని మంచినీటిని ఏర్పాటు చేసి పుణ్యం కట్టుకోవాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

గొల్లుమంటున్న.. చిన్నగొల్లపల్లె

సుండుపల్లె : మండల పరిధిలోని చిన్నగొల్లపల్లె గ్రామ పంచాయతీలోని చిన్నగొల్లపల్లె గ్రామంలో బోరు వేసినా నీళ్లు పడకపోవడంతో తాగునీటి సమస్య ఉందని గ్రామస్తులు తెలిపారు. పెద్దగొల్లపల్లి, బొల్లువాండ్లపల్లె, అన్నదానంవాండ్ల పల్లెలలో వేసవికాలం ప్రారంభం కావడంతో పంచాయతీ బోర్లలో నీరు రాక వ్యవసాయ బోర్ల నుంచి గ్రామస్తులు తాగునీటిని తెచ్చుకుంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నీటి సమస్యను తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.



సుండుపల్లె: కుళాయి నుంచి నీళ్లు రాక ఇబ్బందులు పడుతున్న చిన్నగొల్లపల్లె గ్రామస్తులు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

రామాపురం : వేసవికాలంలో ఆరు బయట నిద్రించేటప్పుడు ఇండ్లకు తాళాలు వేసుకొని ఇంటి సమీపంలో గొర్రెలు, మేకల దొడ్ల వద్ద, పశువుల పాకల సమీపంలో నిద్రించేవారు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి సోమవారం తెలిపారు. మాట్లాడుతూ ఆకతాయిలు, తాగుబోతులు ఎలాంటి చర్యలకైన పాల్పడవచ్చని ప్రజలు జాగృతగా ఉండాలని హెచ్చరించారు. మండలంలో చిట్లూరు పంచాయితీ చనికాలయపల్లెలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు రామాంజనేయులు, రవీంద్ర, మురళీకృష్ణ, నరసింహులు చెందిన నాలుగు ఇండ్లకు తాళాలు పగలగొట్టి ఇంటిలోకి వెళ్లి ఇళల్లో విలువైన వస్తువులు లేకపోవడంతో వస్తువులను చెల్లాచెదురుగా చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. బాధితుల ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ చంద్రశేకర్ హెడ్, కానిస్టేబుల్ గంగాధర్‌లు సంఘటన జరిగిన విధానంపై ఆరా తీశారన్నారు. వేసవిలో ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. గ్రామాలలో రాత్రి సమయంలో పోలీసులు గస్తీ ఏర్పాటు చేస్తున్నామన్నారు.

13 నుంచి ప్రతిష్టాపనోత్సవాలు

నందలూరు : గొల్లపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో ఈనెల 13వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. 13వ తేదీన గోపూజ, మహాగణపతి పూజ తదితర పూజలనంతరం తీర్థప్రసాద వినియోగం, 14న ఉదయం ఆవాహిత పూజలు, యంత్రాభిషేకాలు, ఉదయం 9.30 గంటలకు గ్రామోత్సవం, సూక్త వాహనములు, అరుణ హోమం, మంగళహారతి, 15న శనివారం బహుళ తదియ సందర్భంగా ఉదయం 7.45 గంటల నుంచి 8.45 గంటలలో కలశ ప్రతిష్టలు, విగ్రహ ప్రతిష్టలు, మంత్ర హోమాలు, 11.40 గంటలకు ధ్వజ ప్రతిష్ట, 12 గంటలకు శాంతి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

నీటి సమస్యపై దృష్టి పెట్టాలి

వీరబల్లి : మండలంలోని వివిధ గ్రామాలలో నీటి సమస్య ఏర్పడే ప్రమాదం ఉందని, నీటి సమస్యపై సంబంధిత అధికారులు దృష్టి పెట్టాలని ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. సోమవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రస్తుతం వేసవికాలం ప్రారంభమైందని, దీంతో గ్రామాలలో నీటి ఎద్దడి ఏర్పడుతుందని ఈ సమస్య రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈతో వారు మాట్లాడుతూ గ్రామాలలో ఉన్న మంచినీటి పథకం కింద ఏర్పాటు చేసిన బోర్లు వాటి స్థితిగతులను పరిశీలించాలన్నారు. ఎక్కడైతే బోర్లలో నీటిశాతం తగ్గుతుందో అక్కడ ప్రత్యామ్నాయ తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం వీరబల్లి మండలానికి వస్తున్న రోళ్లమడుగు నీటి చానల్ నుంచి నీరు సక్రమంగా రావడంలేదని కొందరు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ఉపాధిహామీ పనులు గురించి ఆరా తీశారు. ప్రజలు, రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆ శాఖకు సంబంధించిన అధికారులను కోరారు. ముఖ్యంగా గ్రామాలలో పనిచేస్తున్న కార్యదర్శులు అప్రమత్తంగా ఉంటూ ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలని లేకుంటే పైస్థాయి అధికారులకు తెలియపరచాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నూర్జహాన్, డీటీ లక్ష్మీనారాయణ స్వామి, ఆయా మండల శాఖ అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి

పాఠశాల బదలాయింపునకు ఒప్పుకోం

సిద్దవటం : మండలంలోని కమ్మపాలెం గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులను మోడల్ స్కూల్ పేరుతో వేరే పాఠశాలకు పంపించేది లేదని పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ బాలకిషోర్ తెలిపారు. సోమవారం పాఠశాలలోని తల్లిదండ్రుల కమిటీ సమావేశం జరిగింది. పాఠశాల హెచ్ఎం చంద్రకళ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 3, 4, 5 తరగతులు విద్యార్థులను ఫ్రీ మోడల్ స్కూల్ కింద జంగాలపల్లె పాఠశాలకు బదలాయించేందుకు పిల్లల తల్లిదండ్రుల అభిప్రాయాన్ని తెలియజేయాలని తెలిపారు. పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ బాలకిషోర్ మాట్లాడుతూ మోడల్ స్కూల్ పేరుతో స్కూల్‌లో ఉన్న విద్యార్థులను వేరే పాఠశాలకు బదలాయించేది లేదని, గ్రామానికి సుమారు 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న జంగాపల్లె పాఠశాలకు పిల్లలను పంపించే ప్రసక్తే లేదని అన్నారు. ఇక్కడి పాఠశాలలో అన్ని వసతులు ఉన్నాయని, జంగాపల్లె గ్రామంలో పెన్నానది నుంచి ప్రతి రోజు పెద్ద, పెద్ద వాహనాలతో ఇసుక రవాణా జరుగుతోందని పిల్లలకు ప్రమాదం చోటుచేసుకొనే అవకాశాలు ఉన్నాయని అధికారులు పరిశీలించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామంలోని పాఠశాల నుంచి జంగాపల్లె పాఠశాలకు మా పిల్లలను పంపించే ప్రసక్తే లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం సిద్దవటం ఎంపీడీఓ కార్యాలయంలో ఉన్న మండల ప్రత్యేకాధికారి జయసింహకు వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఫణిరాజకుమారి, ఎంఈఓ-2 అరుణ, సిద్దవటం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం శ్రీరాములు, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ బాలకిషోర్ స్థానికులు అయ్యప్ప, నాగభూషణం, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

సమానత్వంతోనే మహిళా సాధికారత సాధ్యం

పెనగలూరు : మహిళలకు అన్ని రంగాలలో సమానత్వం కల్పించినప్పుడే సాధికారత సాధ్యమని తద్వారా సమాజాభివృద్ధి జరుగుతుందని ప్రధానోపాధ్యాయులు లేబాకు గోపాలకృష్ణ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని చక్రంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయినులకు సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ మహిళా హక్కుల కోసం పోరాటం చేసిన ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, మహిళా సమానత్వం సాధికారతతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఎం.సావిత్రమ్మ, కృష్ణకుమారి, ప్రమీల, శ్రీవాణి, పరిమళ, పద్మజ, జయలక్ష్మీ, లక్ష్మీదేవి, అన్వర్ బాషా, సుదర్శన్, మహేంద్ర, హరిప్రసాద్, శివ, నరసింహులు, ప్రసాద్, వెంకట రెడ్డి, ప్రహర్ష తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయినులను సన్మానించిన దృశ్యం

'పోలీసులపై చర్యలు తీసుకోవాలి'

రాజంపేట రూరల్ : రాయచోటి ఘటనలో ఓ వర్గం వారిపై తప్పుడు కేసులు పెట్టి ఉద్రిక్త పరిస్థితులకు బాధ్యులైన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతుగుంట రమేష్ నాయుడు డిమాండ్ చేశారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం రాయచోటి ఎస్ఐ నరసింహారెడ్డి, సీఐలపై కఠిన చర్యలు తీసుకొవాలని వీహెచ్‌పీ నాయకులు ఏవోకు వినతి పత్రం అందజేశారు. కాగా సోమవారం నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పసిగట్టిన పోలీసులు వీహెచ్‌పీ, బీజేపీ నాయకులకు నోటీసులు ఇచ్చారు. ఒకానొక సందర్భంలో నాయకులకు పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. చివరకు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నాయకులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీనివాసులునాయుడు, పెంచల్‌రెడ్డిలతో కలిసి పోతుగుంట మాట్లాడుతూ రాయచోటి ఘటనలో అక్రమంగా అరెస్టు చేసినవారందరినీ బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగుల హక్కుల కోసం పోరాడిన వ్యక్తి 'అనుగంటి'

రాజంపేట రూరల్ : ప్రభుత్వ ఉద్యోగుల హక్కుల కోసం జీవితకాలం పోరాడిన మహోన్నత కామ్రేడ్ అనుగంటి శ్రీరాములు అని ఏపీఎన్‌జీఓస్ తాలూకా అధ్యక్షులు శెట్టిం వెంకటరమణ కొనియాడారు. స్థానిక ఎన్‌జీఓస్ హోమ్‌లో సోమవారం కామ్రేడ్ అనుగంటి శ్రీరాములు 104వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ముందుగా అనుగంటి చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య(ఏఐఎస్‌జీఈఎఫ్) వ్యవస్థాపకులు అనుగంటి అని కొనియాడారు. శాసనసభ్యులుగా, శాసనమండలి సభ్యులుగా పని చేసి ఉద్యోగుల హక్కుల కోసం అహర్నిశలు పోరాటం చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వి.చంద్రశేఖరరెడ్డి, ట్రెజరర్ ఎం.వరదయ్య, అసోసియేట్ ప్రెసిడెంట్ రామాంజనేయులు, ఉపాధ్యక్షులు శ్రీనివాసరాజు, టి.వెంకటసుబ్బయ్య, ఎం.రమేష్, బసవరాజు, మనీ, జిటా, హరి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పెన్షనర్ల అసోషియేషన్ నాయకులు కేవీ క్రిష్ణయ్య, గౌస్‌ఖాన్, పీవీ రమణలను సత్కరించారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు డిమాండ్

రామాపురం : ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన పంటలకు మంచి డిమాండ్ ఉంటోంది. మండలంలో పలు గ్రామాలలో రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన పంటలను సోమవారం మండల కేంద్రంలో విక్రయించారు. అనప, అలసంద, బెండ, కాకర, మిరప వంటి కూరగాయలు తీసుకురాగా వీటికి ఎక్కువ గిరాకీ ఉండడంతో అతి తొందరగా ఈ ప్రకృతి వ్యవసాయ కూరగాయలను అమ్ముడయ్యాయి. కార్యక్రమంలో అధికారులు వెంకటరామిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, కిరణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి



తల్లెం భరత్‌ను అభినందిస్తున్న కొరముట్ల

రైల్వేకోడూరు అర్బన్ : వైఎస్సార్‌సీపీ జోన్ బూత్ కమిటీ అధ్యక్షుడుగా ఎంపికైన తల్లెం భరత్‌కుమార్ రెడ్డిని సోమవారం రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అభినందించారు. ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ నిర్ణయాలను అనుగుణంగా నియోజకవర్గంతోపాటు జిల్లాల్లో పార్టీ పటిష్టతకు కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు.

గ్రామాల్లో శానిటేషన్ డ్రైవ్

సిద్దవటం : ప్రతి ఒక్కరూ చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈఓపీఆర్‌డీ మెహతాబ్ యాస్మిన్ తెలిపారు.మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీలో సోమవారం స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను నిర్వహించారు. మాధవరం-1 గ్రామ పంచాయతీలోని మహబూబ్‌నగర్, అలీనగర్ గ్రామాల్లోని ప్రజలకు శుభ్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

గర్భిణులు సలహాలు పాటించాలి

ఒంటిమిట్ట : గర్భిణులు వైద్యుల సలహాలు, సూచనలు తప్పక పాటించాలని ఒంటిమిట్ట పీహెచ్‌సీ వైద్యాధికారిణి శ్వేత తెలిపారు. సోమవారం స్థానిక పీహెచ్‌సీలో ఆమె 64 మంది గర్భిణులకు పరీక్షలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ గర్భిణులు బలమైన ఆహారాన్ని తీసుకోవాలని, అంగన్‌వాడీ కేంద్రాలలో ఇచ్చే పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలన్నారు. అలాగే ప్రతిరోజూ ఐరన్, క్యాల్షియం సంబంధించి మెడిసన్‌ను తప్పక వాడాలన్నారు. కార్యక్రమంలో అదనపు వైద్యాధికారిణి సబీనా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకు పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వండి

సిద్దవటం : ఎన్‌టీఆర్ పక్కా గృహాలకు, పీఎంఏవై 2.0 గృహాలకు దరఖాస్తులు చేసుకున్న వారికి పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని మండల ప్రత్యేకాధికారి జయసింహ, హౌసింగ్ డీఈ గోపాలక్రిష్ణలు తహసీల్దారు మాధవీలతకు సూచించారు. మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో సోమవారం ఆయన గ్రీవెన్స్ డేకు హాజరయ్యారు. మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులు పక్కా గృహాల కోసం కులము, ఆదాయం, సర్టిఫికెట్లతోపాటు పొజిషన్ సర్టిఫికెట్, ఆధార్ తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఫణిరాజ కుమారి, హౌసింగ్ ఏఈ చెన్నయ్య, ఎంఈఓ-2 అరుణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ద్రౌపది కల్యాణం

లక్కిరెడ్డిపల్లి : కోనంపేట, దప్పేపల్లి గ్రామాలలో మహాభారతం ఘట్టాల ప్రదర్శన ప్రజలను ఆకట్టుకుంటోంది. సోమవారం యజ్ఞంలో భాగంగా ద్రౌపది కల్యాణం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు వందల సంఖ్యలో పాల్గొని వేడుకను తిలకించారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి



వీరబల్లి: వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు



సుండుపల్లె: తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

వీరబల్లి : తమ సమస్యలు తీర్చాలంటూ మండలంలోని అంగన్‌వాడీ వర్కర్లు సోమవారం గ్రీవెన్స్‌లో స్థానిక తహసీల్దార్ వెంకటేష్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం అంగన్‌వాడీ వర్కర్లు తహసీల్దార్ కార్యాలయం ఎదుట కాసేపు ధర్నా నిర్వహించి సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. ఏఐటీయూసీ మండల అధ్యక్షురాలు బేబీ రాణి అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ కనీసం వేతనం అందించాలని, హెల్పర్ల ప్రమోషన్ విషయంలో రాజకీయ జోక్యం అరికట్టాలన్నారు. అందరికీ ఇస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు అంగన్ వాడీ వర్కర్లకు వర్తింపజేయాలన్నారు. సర్వీసులో ఉండి చనిపోయిన వారి కుటుబంలో ఒకరికి తిరిగి ఉద్యోగం ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పాఠశాలల అద్దె బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. మెనూ చార్జీలు పెంచాలని, వేతనంతో కూడుకున్న మెడికల్ లీవులు కనీసం మూడు నెలలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.


సుండుపల్లె : అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ దైవాదీనంకు అంగన్‌వాడీలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని పనికి తగ్గ వేతనాలు ఇవ్వాలని జీతాలు పెంచాలని గ్రాట్యుటీ అమలు చేయాలన్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంట్రల్‌గా మార్చాలని అద్దె బకాయిలు బిల్లులు ఒక నెల ముందే ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు.

అంగన్‌వాడీల అక్రమ అరెస్టులు దుర్మార్గం

రాజంపేట రూరల్ : విజయవాడలో శాంతియుతంగా సమస్యల పరిష్కారానికి తలపెట్టిన మహాధర్నాకు వెళుతున్న అంగన్‌వాడీలను అక్రమంగా అరెస్టులు చేయటం దుర్మార్గమని ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి ఇ.సికిందర్ అభిప్రాయపడ్డారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఏఐటీయూసీ నాయకులతో కలిసి సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలపై కూటమి ప్రభుత్వం ఒక వైపు అధికారులతో తీవ్రమైన ఒత్తిడికి గురిచేస్తుందని మండిపడ్డారు. రెండవ వైపు పోలీసు అధికారులతో అక్రమ అరెస్టులు చేయించి వారిని ఉద్యమాలను అణచివేస్తుండటాన్ని తప్పుబట్టారు. కర్నూలు, డోన్, ఎర్రగుంట్ల తదితర ప్రాంతాలలో వందలాది మందిని రైలు నుంచి దించి అరెస్టులు చేయటం దారుణమన్నారు. ఏలూరు జిల్లాలో అంగన్‌వాడీలకు వాహనాలు ఇవ్వకుండా అద్దె వాహనదారులను బెదిరించటం తగునా అని ప్రశ్నించారు. రాజమండ్రి, కోనసీమ జిల్లాలలో రిజర్వేషన్ చేసుకొని బస్సు ఎక్కిన అంగన్‌వాడీలను దించివేయటం కూటమి ప్రభుత్వానికి తగదన్నారు. ఇలాంటి దుర్మార్గమైన చర్యలను కూటమి ప్రభుత్వం నిలుపుదల చేయాలని కోరారు. 42 రోజుల సమ్మె కాలపు ఒప్పందాన్ని అమలు చేయాలన్నారు. గ్రాట్యుటీపై గత జీఓను కొత్తగా ఇచ్చినట్లు అబద్ధపు ప్రచారంతో అంగన్‌వాడీలను మోసగించడం సీఎం చంద్రబాబుకు తగదని హితవు పలికారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు, నరసింహ, జమాల్, రమణ, రవి, రాఘవ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు రోల్ మోడల్‌గా ఎదగాలి

రాయచోటి అర్బన్ : విద్యార్థులు చిన్నప్పటి నుంచే రోల్ మోడల్‌గా ఎదగాలని స్కౌట్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి ఎం.నరసింహారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని అర్చన కళాశాలలో పీఎం శ్రీ పాఠశాలల నుంచి వచ్చిన 250 మంది స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులకు పెట్రోల్ లీడర్ శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కౌట్ శిక్షణతో విద్యార్థులలో క్రమశిక్షణ, సేవాభావం పెంపొందుతాయన్నారు. 5 రోజులపాటు సాగే శిక్షణా కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్కౌట్ శిక్షణను పూర్తిచేసుకున్న విద్యార్థులకు విద్యా, ఉద్యోగ అవకాశాలలో రిజర్వేషన్ సౌకర్యం ఉందన్నారు. అర్చన విద్యాసంస్థల కరస్పాంటెంట్ మదనమోహన్ రెడ్డి మాట్లాడుతూ స్కౌటింగ్ ద్వారా విద్యార్థులకు శారీరక, మానసిక వికాసం అలవడుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఓ లక్ష్మీకర్, హెచ్‌డబ్ల్యూ నిర్మల, స్కౌట్ మాస్టర్‌లు నాగరాజు, గైడ్ కెప్టెన్‌లు గోవిందమ్మ, స్వర్ణలత, వాణిశ్రీ, రాధ, స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్కౌట్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి

జనావాసాల్లో మద్యం షాపులు వద్దు

రాయచోటి జగదాంబ సెంటర్ : పట్టణంలోని చిత్తూరు రోడ్డు బ్రాందీ షాప్‌ను మదనపల్లి రోడ్డులోని విద్యాసంస్థలు, నివాసాల సమీపంలోకి మార్చడం తగదని సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసులు, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సుమిత్రలు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం రాయచోటి కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేసి డీఆర్ఓ మధుసూధనరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రశాంతమైన ప్రదేశంలో బ్రాందీ షాపులు ఏర్పాటు చేయడం ద్వారా బాలికలు, మహిళలకు రక్షణ లేకుండా పోతుందన్నారు. అలానే విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసై భవిష్యత్తు నాశనం అయ్యే ప్రమాదం ఉందన్నారు. బ్రాందీ షాపును విద్యాసంస్థలు, జనావాసాల వద్ద ఏర్పాటు చేయకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.



డీఆర్ఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు